సాక్షి రంగారెడ్డి

సోమవారం ⬝ 8 ⬝ జనవరి ⬝ 2024



'సాక్షి' స్పెల్‌బీ

'సాక్షి' మీడియా గ్రూపు ఆధ్వర్యంలో ఆదివారం 'స్పెల్ బీ' సెమీ ఫైనల్ రౌండ్ కాంపిటీషన్‌ను నిర్వహించారు. 8లో▸



ఇరుకు రోడ్డు

ఎర్రకుంట రోడ్డు శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్లే ప్రధాన మార్గం. సహజంగానే వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. 8లో▸



ఆర్యవైశ్యుల ఉన్నతికి కృషి

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేస్తానని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్‌రూరల్: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని గురుకుల కళాశాల కమ్మదనం ప్రిన్సిపాల్ విద్యుల్లత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా కళాశాల(సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్)లో 2024–25 విద్యాసంవత్సరానికి గాను 2023–24లో పదోతరగతి పూర్తి చేసిన వారు అర్హులన్నారు. 2024 జనవరి 15 వరకు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన విద్యార్థినులకు ఇంటర్‌తో పాటు ఐఐటీ, నీట్‌కు ప్రత్యేక శిక్షణ ఉంటుందన్నారు.

స్టాక్ డెలివరీపై గ్యాస్ డీలర్ల అప్రమత్తత అవసరం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: గ్యాస్ డీలర్లు తమ గిడ్డంగితో పాటుగా స్టాక్ డెలివరీపై కన్నేసి ఉంచాలని లేదంటే అక్రమాలు జరిగే అవకాశం ఉందని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ స్పష్టం చేశారు. ఆదివారం ఆయన సాగర్ రోడ్డులో గ్యాస్ సిలిండర్లను తరలిస్తున్న పలు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ.. గ్యాస్ డీలర్లు ఏమాత్రం ఏమరపాటుగా ఉండొద్దని సూచించారు. ఇటీవల ఐశ్వర్య గ్యాస్ ఏజెన్సీ నుంచి పెద్ద మొత్తంలో బండలు రీఫిల్లింగ్ మాఫియాకు చేరిన సంగతి గుర్తు చేశారు. గ్యాస్ డీలర్లు రోజువారీగా గిడ్డంగిలోని నిల్వలు, సరఫరా వంటి అంశాలను ఆరా తీయాలని సూచించారు. చమురు కంపెనీలు గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఏ మాత్రం జాప్యం చేయనప్పటికీ, డీలర్ల పర్యవేక్షణ కొరవడడం వల్లే కొందరు వినియోగదారులకు గ్యాస్ సకాలంలో చేరడం లేదనే ఫిర్యాదులు ఉన్నాయన్నారు. వినియోగదారులకు సేవలో డీలర్లు విఫలమైతే చర్యలుంటాయన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న జంగయ్య

షాద్‌నగర్: పార్టీని గ్రామ స్థాయి నుంచి పటిష్టం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య అన్నారు. ఆదివారం పట్టణంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుద్దుల జంగయ్య అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్మాకుల జంగయ్య మాట్లాడుతూ.. పార్టీ బలోపేతంతోనే పేదలకు, కార్మిక వర్గానికి మేలు జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వాన్ని పెంచేందుకు కృషి చేయాలన్నారు. పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు పర్వతాలు మాట్లాడుతూ... గ్రామ స్థాయిలో పార్టీని విస్తరించేందుకు అవకాశాలున్నందున కార్యకర్తలు తగిన చొరవ చూపాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీను, వెంకటేశ్, గోవింద్, షకీల్, గడ్డం జంగయ్య, చంద్రబాబు, లింగం నాయక్, పవన్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి

టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్

గచ్చిబౌలి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని భారత టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్ అన్నారు. ఆదివారం గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఆర్‌జీ రావు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ 'సూర్య ది గ్లోబల్ స్కూల్' వార్షిక క్రీడోత్సవాలను ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. క్రీడోత్సవాల నిర్వహణతో విద్యార్థుల్లో స్ఫూర్తిని నెలకొల్పి వారు రాణించేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో టీఎంఐ గ్రూప్, ఐఐటీ చెన్నై, అహ్మదాబాద్ త్యాగరాజన్ మురళీధర్, ఆర్‌జీరావు ట్రస్ట్ చైర్మన్ నర్సింగరావు, వ్యవస్థాపకుడు దామోదర్‌రావు, మేనేజింగ్ ట్రస్టీ డా.సునీల, ప్రిన్సిపల్ లక్ష్మీధరిత్రి పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కేంద్రం@ 'రాచకొండ'



దేవులమ్మ నాగరంలోని శిలాశాసనం

రాచకొండ గుట్టలోని ఆలయాలు నిత్యపూజలు, ధూపదీప నైవేద్యాలతో పూర్వ వైభవం సంతరించుకుంటున్నాయి. వందల ఏళ్ల చరిత్ర ఉన్న ఈ ఆలయాల సందర్శనకు భక్తులు బారులు తీరుతున్నారు. భవిష్యత్‌లో ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు.

- పురాతన ఆలయాలకు పూర్వవైభవం
- నిత్యపూజలు, కల్యాణోత్సవాలకు పోటెత్తుతున్న భక్తులు

మంచాల: రంగారెడ్డి–యాదాద్రి జిల్లాల సరిహద్దు ప్రాంతంలో ఎత్తైన గుట్టల నడుమ పచ్చని ప్రకృతి అందాలతో చారిత్రాత్మక ఆలయాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ఇక్కడ వెలసిన దైవ స్వరూపాలను దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మిక. 13వ శతాబ్దం కాకతీయ రాజుల కాలంలో వారి సామంత రాజులుగా ఉన్న రేచర్ల పద్మనాయకులుండేవారు. వీరి పాలనలో క్రీస్తు శకం 1325 నుంచి 1475 వరకు సుమారు 152 సంవత్సరాలు స్వతంత్ర రాజ్యానికి రాచకొండ పట్టణం రాజధానిగా ఉంది. నాటి రాతి కట్టడాలు, ఎత్తైన ప్రహరీలు, శిల్పకళలో నిర్మించిన ఆలయాలు, గోపురాలు నేటికీ వీక్షకులను కట్టిపడేస్తున్నాయి.

అభిషేక పూజలు.. ఉర్సు ఉత్సవాలు

రాచకొండ గుట్టలోని శివాలయానికి సోమ, శుక్ర వారం పెద్ద ఎత్తున భక్తులు పోటెత్తుతున్నారు. నల్గొండ, యాదాద్రి, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నుంచి ప్రజలు ఎక్కువగా శివయ్య దర్శనానికి విచ్చేస్తున్నారు. పొలం పనుల్లో శివుడి విగ్రహం లభ్యమవ్వడంతో పురావస్తు శాఖవారు పరిశీలించి పురాతమైన ఈ శివుడి విగ్రహం ఎంతో విశిష్టమైనదని చెప్పారు. అక్కడే లింగ ప్రతిష్ఠాపన చేశారు. నాటి నుంచి ప్రతీ శివరాత్రికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహిస్తున్నారు. ప్రతీ ఏడాది ఫిబ్రవరిలో గాలీబ్ హజరత్ దర్గ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. రాచప్ప సమితి ఆధ్వర్యంలో లక్ష్మీనృసింహ స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేశారు. రాచకొండ ఫోర్ట్ సమీపంలోని రామాలయంలోనూ నిత్యపూజలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ శ్రీరామ నవమి రోజున కల్యాణోత్సవం కన్నుల పండువగా చేపడుతున్నారు. ఈ గుట్టలకు సమీపంలోని ఆరుట్లలో రేచర్ల పద్మనాయకులు నిర్మించిన బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి నుంచి అమావాస్య వరకు ప్రత్యేక జాతర కొనసాగుతుంది. ఆరుట్ల శివాలయం వద్ద ఎత్తైన ఏకశిల ధ్వజ స్తంభం రాచకొండ రాజుల శిల్పసంపదే. దేవులమ్మ నాగారంలో రావు మాధవ నాయుడి భార్య నాగాంబిక మహావిష్ణు ఆలయ నిర్మాణంతో పాటుగా చెరువు తవ్వించింది. నాటి శిలాశాసనం నేటికీ మనకు కనిపిస్తుంది.



సరళ మైసమ్మ తల్లి ఆలయం

నాడు తొలిబోనం

రాచకొండ గుట్టలోని సరళమైసమ్మ ఆలయం అభివృద్ధితోపాటు నిత్య పూజలు అందుకుంటోంది. తెలంగాణకు తొలి రాజధానిగా వెలుగొందిన సమయంలో అమ్మవారికి తొలి బోనం ఎక్కించేవారు. అంతటి మహిమాన్విత మైన ఈ అమ్మవారిని దర్శనానికి ఆది, గురువారాల్లో వేలాది మంది భక్తులు విచ్చేస్తున్నారు. ఆంధ్ర, తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా అమ్మవారిని కొలుచుకుంటున్నారు.

అభివృద్ధి చేయాలి



రాచకొండ గుట్టల్లోని పురాతన ఆలయాలను మరింత అభివృద్ధి చేయాలి. భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి. వందల్ల ఏళ్ల చరిత్ర ఉన్న ఈ ఆలయాల్లో పూజలు నిర్వహిస్తే శుభం జరుగుతుందని నమ్మిక.

– మైలారం సైదులు, జై కేసారం, చౌటుప్పల్

చరిత్రను కాపాడాలి



ఆలయాలను అభివృద్ధి చేసి చరిత్రను కాపాడాలి. ఆలయాలవద్ద చరిత్రను తెలిపేలా బోర్డులు ఏర్పాటు చేశాం. నాలుగేళ్లుగా ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి బహుమతులిస్తున్నాం. శివాలయం వద్ద ప్రతీ సోమవారం అన్నదాన కార్యక్రమం కొనసాగిస్తున్నాం.

– కృష్ణ కుమార్, చైర్మన్, రాచకొండ రాచప్ప సమితి



ఆశలన్నీ.. ఆన్‌లైన్‌లోకి!

- ప్రజా పాలనలో పోటెత్తిన దరఖాస్తులు
- జిల్లా వ్యాప్తంగా 5,53,277 అర్జీలు
- 17 లోగా ఆన్‌లైన్‌లో నమోదుకు కృషి
- కంప్యూటర్ ఆపరేటర్ల కొరతతో ఆందోళన

సాక్షి, రంగారెడ్డిజిల్లా: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన'కు విశేష స్పందన లభించింది. అభయ హస్తం ఆరు గ్యారంటీల పథకం అమల్లో భాగంగా ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో అర్జీలు అందాయి. స్వీకరణ క్రతువు రెండు రోజుల క్రితమే ముగిసింది. అర్జీలను ఆన్‌లైన్‌లో క్రోడీకరించే అంశంపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. ఇప్పటికే వివిధ విభాగాల్లో పని చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ పూర్తిచేసింది. ఈ నెల 17 లోగా అర్జీల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని నిర్ణయించింది. అయితే ఆశించిన స్థాయిలో కంప్యూటర్ ఆపరేటర్లు లేక పోవడం ఒకింత ఆందోళన కలిగిస్తుంది.

ఎనిమిది రోజులు..

ప్రభుత్వం 2023 డిసెంబర్ 28న ప్రజాపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై.. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సెలవు రోజులు మినహా ఎనిమిది రోజుల పాటు అర్జీలు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 5,53,277 దరఖాస్తులు అందాయి. 16 మున్సిపాలిటీల నుంచి 2,61,807 దరఖాస్తులు రాగా, 21 మండలాల పరిధిలోని 558 గ్రామ పంచాయతీల నుంచి 2,91,470 దరఖాస్తులు అందాయి. వీటిలో మెజార్టీ దరఖాస్తులు గృహలక్ష్మి, రేషన్‌కార్డులు, చేయూత పథకాలకు సంబంధించినవే కావడం గమనార్హం.

రేషన్‌కార్డులు, 'గృహజ్యోతి'కి డిమాండ్

ఆరు గ్యారంటీల పథకంలో భాగంగా అభయ హస్తం, మహాలక్ష్మి, గృహజ్యోతి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాలకు ప్రజల నుంచి దరఖాస్తులు అందాయి. గ్రామ పంచాయతీల పరిధిలో 2,46,626 నివాసాలు, మున్సిపాలిటీల పరిధిలో 2,88,361 నివాసాల నుంచి అర్జీలు పెట్టుకున్నారు. మెజార్టీ దరఖాస్తులు గృహజ్యోతి, రేషన్ కార్డులకు సంబంధించినవే ఉన్నాయి. మున్సిపాలిటీల నుంచి అందిన అర్జీల్లో 47,551 రేషన్‌కార్డులకు సంబంధించినవే కావడం విశేషం. ఆయా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో క్రోడీకరించే ప్రక్రియకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే జిల్లాలో ఆశించిన స్థాయిలో సాంకేతిక సిబ్బంది లేకపోవడం ఈ పనులకు ఇబ్బందిగా మారింది.

జిల్లా వ్యాప్తంగా అందిన అర్జీల వివరాలు

తేదీ	మున్సిపాలిటీలు	గ్రామ పంచాయతీలు
28	33,068	29,874
29	42,472	57,105
30	31,831	57,567
02	25,421	47,732
03	21,395	32,342
04	20,617	25,141
05	16,936	19,114
06	22,508	22,595

పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ సస్పెండ్



వేటుకు గురైన ఇన్‌స్పెక్టర్ సతీశ్

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా కె.సతీశ్ బాధ్యతలు చేపట్టి ఆరు నెలలు గడవక ముందే భూ వివాదంలో తలదూర్చారనే ఆరోపణలతో సస్పెండ్ అయ్యారు. 2004 బ్యాచ్‌కు చెందిన సతీశ్ 2023 జూన్ 14న పహాడీషరీఫ్ సీఐగా బాధ్యతలు చేపట్టారు. ఆరు మాసాల్లో స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల అంశం, అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ ప్రశాంత వాతావరణంలోనే కొనసాగింది. కానీ అధికార పార్టీ రాష్ట్ర స్థాయి నేతకు సంబంధించిన భూ వివాదంలో తలదూర్చారనే ఆరోపణల నేపథ్యంలో రాచకొండ సీపీ విచారణ చేపట్టి సస్పెండ్ చేశారు. ఈ వివాదంలో ఇన్‌స్పెక్టర్ మాత్రమే ఉన్నారా...? మరెవరైనా ఉన్నత స్థాయి అధికారులు ఉన్నారా అని స్థానికంగా చర్చలు సాగుతున్నాయి.

ఏడాది గడవకుండానే..

రెండు నుంచి మూడేళ్లపాటు విధులు నిర్వహించాల్సిన ఎస్‌ఎహెచ్‌ఓలు పహాడీషరీఫ్ పీఎస్‌లో మాత్రం ఏడాది కూడా పనిచేయడం లేదు. రకరకాల కారణాలతో బదిలీలు, సస్పెండ్ అవుతున్నారు.

- 2020 జూలై 23న సీఐగా బాధ్యతలు చేపట్టిన విష్ణువర్ధన్‌రెడ్డి ఏడాది తిరగకుండానే 2021 జూలై 15న అవినీతి ఆరోపణలతో సస్పెండ్ అయ్యారు.
- 2021 ఆగస్టు 4న బాధ్యతలు చేపట్టిన సి.వెంకటేశ్వర్లు 14 నెలలు పనిచేసి 2022 అక్టోబర్ 4న అకస్మాత్తుగా బదిలీ అయ్యారు.
- అక్టోబర్‌లో బాధ్యతలు చేపట్టిన కిరణ్ కుమార్ 2023 మార్చిలో రాజకీయ ఫిర్యాదులతో బదిలీ అయ్యారు. మూడు నెలల పాటు డీఐ కాశీ విశ్వనాథ్ ఇన్‌చార్జి ఎస్‌హెచ్‌ఓగా కొనసాగారు.
- 2023 జూన్ 14న బాధ్యతలు చేపట్టిన సతీశ్ ఆరు నెలలు గడవక ముందే భూ వివాదం ఆరోపణలతో 2024 జనవరి 7న సస్పెండ్ అయ్యారు.



పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్

స్నేక్ గ్యాంగ్ ఉదంతం నుంచి

స్నేక్ గ్యాంగ్ లాంటి ఉదంతంతో రాష్ట్ర వ్యాప్తంగా మార్మోగిన పహాడీషరీఫ్ పీఎస్‌పై పోలీసు ఉన్నతాధికారుల ప్రత్యేక నిఘా ఉంటుంది. ఒకవైపు హత్యలు, హత్యాయత్నాల లాంటి నేరాలకు ఆస్కారం ఉండడం.. ఆపై నగర శివారు కావడంతో పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్ వ్యాపారం కొనసాగుతున్న ఈ ఠాణా పరిధిలో విధి నిర్వహణ కత్తిమీద సాములాంటిదే. పై స్థాయి అధికారుల ఆదేశాల కోసం భూ వివాదాలలో తలదూర్చి స్థానిక పోలీసులు తమ మెడకు చుట్టుకున్న సందర్భాలు సైతం గతంలో వెలుగు చూశాయి. ఏదేమైనా తరచూ ఎస్‌హెచ్‌ఓలు మారుతుండడంతో నేరాల నివారణ, ఈ ప్రాంతంపై పట్టు సాధించడం కొత్తగా వచ్చిన అధికారులకు ఇబ్బందికరంగా మారుతోంది.

కంప్యూటరీకరణలో తప్పులుండొద్దు

జెడ్పీ సీఈఓ దిలీప్‌కుమార్

షాద్‌నగర్: ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో తప్పులు లేకుండా ఎంట్రీ చేయాలని జిల్లా పరిషత్ సీఈఓ దిలీప్‌కుమార్ సూచించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో చేపట్టిన నమోదు ప్రక్రియను ఆదివారం ఆయన పరిశీలించారు. గ్రామాల వారీగా ఎన్ని దరఖాస్తులు వచ్చాయో తెలుసుకున్నారు. అనంతరం దిలీప్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రజాపాలన పేరిట ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో దరఖాస్తులను ఎంట్రీ చేస్తున్నట్లు వివరించారు. పొరపాట్లకు తావివ్వకుండా నమోదు ప్రక్రియ కొనసాగాలని సూచించారు. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆన్‌లైన్ చేసిన దరఖాస్తు పత్రాలను జాగ్రత్తగా భద్రపరచాలని చెప్పారు. ఈ నెల 17 నాటికి నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకన్న, ఎంపీడీఓ వినయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకత పాటించాలి

కొందుర్గు: అభయహస్తం దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియలో పారదర్శకత పాటించాలని జిల్లా పరిషత్ సీఈఓ దిలీప్‌కుమార్ సూచించారు. ఆదివారం ఆయన చౌదరిగూడ మండలపరిషత్ కార్యాలయాన్ని సందర్శించి ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. దరఖాస్తుదారుడు లిఖితపూర్వకంగా వ్రాసి ఇచ్చిన దరఖాస్తును జాగ్రత్తగా చూసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఎలాంటి పొరపాట్లు జరుగకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మహేశ్‌బాబు, ఎంపీఓ విజయ్ కుమార్ పాల్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



షాద్‌నగర్: ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ దిలీప్‌కుమార్

లైన్ లాస్!



విద్యుత్ అంతర్గత నష్టాలపై డిస్కం అలర్ట్

- సర్కిళ్ల వారీగా రివ్యూలు.. నష్టాలపై ఆరా
- లైన్‌లాస్, టెక్నికల్ లాసెస్‌పై సీఎండీ దృష్టి
- ఫీడర్లు, డీటీఆర్‌లు, కనెక్షన్ల వారీగా తనిఖీలు
- ఆర్టిజన్ మొదలు.. సీజీఎం వరకు అంతా బిజీ

నష్టాల్లో కూరుకుపోయిన విద్యుత్ సంస్థను లాభాల బాట పట్టించాలని డిస్కం నిర్ణయించింది. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ముషారఫ్ అలీ ఫరూఖీ సంస్థాగత నష్టాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు ఇటీవల ఆపరేషన్స్, ప్రాజెక్ట్స్, హెచ్‌ఆర్, పీ అండ్ ఎం, విజిలెన్స్, డీపీఈ విభాగాల ఇంజినీర్లతో సమావేశమై.. అంతర్గత నష్టాలపై ఆరా తీశారు. అత్యధిక నష్టాలున్న సర్కిళ్లను గుర్తించి, వాటిని పూర్తిగా నియంత్రించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆయా సర్కిళ్లు, డివిజన్ల పరిధిలోని ఇంజినీర్లు బృందాలుగా విడిపోయి ఫీడర్ల వారీగా తనిఖీలు చేపడుతున్నారు. సాంకేతిక నష్టాలతో పాటు లైన్‌లాస్‌లను పూర్తిగా నియంత్రించి, పారిశ్రామిక, ఇతర కమర్షియల్ బిల్లులను పక్కాగా వసూలు చేయడం ద్వారా నగరంలో 200 యూనిట్ల లోపు విద్యుత్‌ను వినియోగిస్తున్న పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచితంగా విద్యుత్‌ను సరఫరా చేయొచ్చనే భావనలో ఉన్నారు.

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలో తొమ్మిది సర్కిళ్లు ఉన్నాయి. వీటి పరిధిలో 58 లక్షలకుపైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో 48 లక్షలకుపైగా గృహ, ఎనిమిది లక్షలకుపైగా వాణిజ్య, 40 వేలకుపైగా పారిశ్రామిక కనెక్షన్లు ఉన్నాయి. వీధి లైట్లకు సంబంధించిన కనెక్షన్లు మరో 48 వేలు, ఉండగా, 1,95,821 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. ధోబీ ఘాట్లు, సెలూన్లు, ఫౌల్ట్రీ కనెక్షన్లకు సంబంధించి 27,318 వరకు ఉన్నాయి. వీటి నుంచి నెలకు రూ.450 కోట్లకుపైగా విద్యుత్ బిల్లుల రూపంలో రావాల్సి ఉంది. కానీ లైన్‌లాస్, విద్యుత్ చౌర్యం వంటి కారణాలతో హైదరాబాద్ సౌత్ సహా హైదరాబాద్ సెంట్రల్, సైబర్‌సిటీ, రాజేంద్రనగర్, వికారాబాద్ సర్కిళ్లలో నష్టాలు ఎక్కువగా నమోదవుతున్నాయి. కేవలం హైదరాబాద్ సౌత్‌లోనే 44 శాతం నష్టాలు నమోదవుతుడటం గమనార్హం. ఈ నష్టాల భారం ఇతర సర్కిళ్లపై పడుతోంది. వీటి నియంత్రణ కోసం డిస్కం సర్కిళ్ల వారీగా ప్రత్యేక విజిలెన్స్ బృందాలను ఏర్పాటు చేసినా.. ఆశించిన ప్రయోజనం నెరవేరడం లేదు. అంతేకాదు అంతర్గత నష్టాలను నియంత్రించే అవకాశం ఉన్నా.. రాజకీయ కారణాల వల్ల ఇప్పటి వరకు అటు వైపు దృష్టి సారించలేదు. ముఖ్యంగా ఐటీ అనుబంధ సంస్థలు, వాణిజ్య సంస్థలు అధికంగా ఉన్న సైబర్ సిటీ సర్కిల్ పరిధిలో 14 శాతం నష్టాలు ఉండటానికి కారణాలను అన్వేషించే పనిలో పడింది.

లైన్ టు లైన్ తనిఖీలు..

ఇటీవల అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్.. 200 యూనిట్లలోపు గృహ విద్యుత్ వినియోగదారులకు ఉచితంగా సరఫరా చేయనున్నట్లు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా.. ప్రత్యామ్నాయ అంశాలపై దృష్టి సారించింది. దీనిలో భాగంగా జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కం సీఎండీలను మార్చేసింది. విద్యుత్ సంస్థలను ప్రక్షాళన చేసింది. ఇటీవలే డిస్కం బాధ్యతలు స్వీకరించిన సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీ మొదట లీకేజీలపై దృష్టి సారించారు. ఫీడర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల వారీగా ఎనర్జీ ఆడిటింగ్‌కు ఆదేశాలు జారీ చేశారు. దీంతో డైరెక్టర్లు మొదలు సీజీఎంలు, ఎస్‌ఈలు, డీఈలు, ఏడీఈలు, ఏఈలు, లైన్స్ ఇన్స్‌పెక్టర్లు, జూనియర్ లైన్‌మెన్లు, ఆర్టిజన్ల వరకు బృందాల వారీగా ఏర్పడి, రోజుకో ఫీడర్ చొప్పున చుట్టేస్తున్నారు. డీటీఆర్‌ల వద్ద ఆయిల్ లీకేజీలు గుర్తించి వాటిని అరికట్టడంతో పాటు, ప్రాపర్ ఎర్తింగ్ ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలను గుర్తించి వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయడం, లూజుగా వేలాడుతున్న వైర్లను సరి చేయడం, లైన్లకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలను తొలగించడంతో పాటు కనెక్షన్ల వారీగా తనిఖీలు చేపడుతున్నారు. ఫీడర్ నుంచి పంపిణీ జరుగుతున్న కరెంట్ యూనిట్లకు వస్తున్న బిల్లింగ్‌కు పక్కాగా లెక్కలేస్తున్నారు.

అనవసర కొనుగోళ్లపై ఆంక్షలు

- ఇప్పటి వరకు నెలవారీ రెవెన్యూ వసూళ్లపైనే డిస్కం ఎక్కువ దృష్టి సారించింది. సర్కిళ్ల వారీగా ఉద్యోగులకు టార్గెట్లు ఇచ్చి మరీ వసూళ్లు చేసింది. సకాలంలో బిల్లు చెల్లించని వినియోగదారుని కనెక్షన్ కట్ చేసి బలవంతపు వసూళ్లకు దిగింది. రెవెన్యూ వసూళ్లు వంద శాతం దాటినా నష్టాల ఊబి నుంచి సంస్థ గట్టెక్కలేకపోతోంది. ఏళ్ల తరబడి భారీగా పేరుకపోయిన బకాయిలను వసూలు చేయకుండా నెలవారి బిల్లులపైనే ఎక్కువ దృష్టి పెట్టడం కూడా ఈ నష్టాలకు ఓ కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అంతేకాదు విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న అక్రమార్కులను పక్కాగా గుర్తించి, వారిపై కేసులు నమోదు చేయకపోవడం, ఫెనాల్టీ వేసి సకాలంలో వసూళు చేయకపోవడం కూడా మరో కారణం.
- లైన్ల పునరుద్ధరణ, నిర్వహణ పేరుతో డిస్కం ఏటా రూ.వంద కోట్లకుపైగా ఖర్చు చేస్తున్నా.. ఆశించిన స్థాయిలో సరఫరా వ్యవస్థ మెరుగుపడకపోవడం కూడా సంస్థ నష్టాలకు ఇంకో కారణం. డీటీఆర్ ఫెల్యూర్‌లను తగ్గించడం, ఆయిల్ లీకేజీలను అరికట్టడం, లూజ్ కాంటాక్ట్‌లను సరి చేయడం, లైన్లమధ్య వేలాడుతున్న చెట్ల కొమ్మలను తొలగించడం, డీటీఆర్‌ల వద్ద సరైన ఎర్తింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయడం, హెచ్‌డీ మీటర్ మీరింగ్, బిల్లుల జారీలో ఏడీఈలు విధిగా పాల్గొనడం, కొత్త కనెక్షన్లు, ప్యానల్ బోర్డులు, డీటీఆర్‌ల మంజూరులో చోటు చేసుకుంటున్న జాప్యాన్ని అరికట్టడం, సిబ్బంది అవినీతిని పూర్తిగా నియంత్రించడం ద్వారా సంస్థను కొంతవరకైనా నష్టాల భారీ నుంచి బయటపడేయవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

నష్టాలు ఇలా..

సర్కిల్	శాతాల్లో
హైదరాబాద్ సెంట్రల్	13.4
సరూర్‌నగర్	11.5
హబ్సిగూడ	7.3
మేడ్చల్	5.7
రాజేంద్రనగర్	13.0
వికారాబాద్	52.0
సైబర్‌సిటీ	14.0
సికింద్రాబాద్	6.4
బంజారాహిల్స్	5.0
హైదరాబాద్ సౌత్	44.0

విద్యార్థులకు సువర్ణావకాశం 'సాక్షి' స్పెల్‌బీ

- 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో నిర్వహణ
- నాలుగు జిల్లాల నుంచి పాల్గొన్న 600 మంది విద్యార్థులు
- సెమీఫైనల్ రౌండ్‌లో ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు

దుండిగల్: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బౌరంపేటలోని శిఖర స్కూల్‌లో 'సాక్షి' మీడియా గ్రూపు ఆధ్వర్యంలో ఆదివారం 'స్పెల్ బీ' సెమీ ఫైనల్ రౌండ్ కాంపిటీషన్‌ను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆరు కేటగిరీల వారీగా పోటీలు నిర్వహించారు. ఇందులో రంగారెడ్డి, హైదరాబాద్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన 70 పాఠశాలలకు చెందిన దాదాపు 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీతత్వాన్ని పెంచే విధంగా ఇలాంటి పోటీలు నిర్వహించడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు 'సాక్షి' యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు.


'సాక్షి' స్పెల్ బీలో పాల్గొన్న విద్యార్థులు


కార్యక్రమానికి హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు

ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు..

డ్యూక్స్ వెఫి, ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్, రాజమండ్రి సౌజన్యంతో 'సాక్షి' మీడియా గ్రూపు నిర్వహించిన ఈ స్పెల్ బీ పోటీల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. కాంపిటీషన్ అనంతరం తాము పరీక్షలో ఏ విధంగా పాల్గొన్నాం.. ఎన్ని ప్రశ్నలకు జవాబులు రాశామో చర్చించుకుంటూ తల్లిదండ్రులతో ఆనందంగా పంచుకోవడం కనిపించింది. ఈ కార్యక్రమంలో తమ పిల్లల చదువులకు ఎంతగానో ఉపయోగపడుతుందని, సాక్షి యాజమాన్యానికి కతృజ్ఞతలు అంటూ తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.


పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు

ఐయామ్ వెరీ హ్యాపీ..



నేను గాజుల రామారంలోని తత్వ స్కూల్‌లో సెవెన్త్ క్లాస్ చదువుతున్నాను. గతంలో నిర్వహించిన పోటీల్లోనూ పాల్గొన్నాను. పై రౌండ్‌కు అర్హత సాధించడంతో నాలో ఆత్మవిశ్వాసం వచ్చింది. మరో సారి పాల్గొనేందుకు వచ్చాను. స్పెల్ బీ, మ్యాథ్స్ బీకి అర్హత సాధించడంతో ఐయామ్ వెరీ హ్యాపీ.

– త్రిషికేశ్, విద్యార్థి

SAKSHI SPELL Bee 2023-24

SAKSHI
సాక్షి / సాక్షి TV
SAKSHI DIGITAL
MEDIA GROUP

ఇది సూపర్బ్ ప్రోగ్రాం



'సాక్షి' నిర్వహించిన స్పెల్ బీ పరీక్షలో 98 శాతం అన్ని కరెక్ట్‌గా రాశాను. ఇది సూపర్బ్ ప్రోగ్రాం అని చెప్పొచ్చు. మొదటగా ఎల్‌బీ నగర్‌లో నిర్వహించిన పోటీల్లో పాల్గొని అర్హత సాధించాను. దీంతో రెండవ సారి పాల్గొనడానికి ఇక్కడకి వచ్చాను. అందరూ సహకరించారు. – తండ్రితో అబ్దుల్ రెహమాన్, విద్యార్థి

విద్యార్థులకు మంచి అవకాశం



విద్యార్థులకు సాక్షి స్పెల్ బీ సువర్ణావకాశం. మేం చిన్నతనంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్నాం. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో నైపుణ్యం పెంచే విధంగా 'సాక్షి' చేపట్టిన ఈ కార్యక్రమం అద్భుతం. వారిలో నేర్చుకోవాలనే తపన పెరుగుతుంది. ఇక్కడికి నా కూతురును తీసుకురావడం చాలా సంతోషంగా ఉంది.

– నర్మద, విద్యార్థిని తల్లి, మహబూబ్‌నగర్

ఎన్నో విషయాలు నేర్చుకున్నా..



స్కూళ్లలో చెప్పే ఇంగ్లిష్‌కు.. ఇక్కడ స్పెల్ బీలో ఉపయోగించిన ఇంగ్లిష్‌కు చాలా తేడా ఉంటుంది. ఇంగ్లిష్ పదాలను ఎలా ఉచ్చారణ చేయాలో నేర్చుకున్నా. స్కూల్‌లో పాల్గొన్న పోటీల కంటే ఇక్కడ పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది.

– శాన్వి జోషి, విద్యార్థిని, నాచారం

సాక్షి మీడియాకు థ్యాంక్స్



విద్యార్థుల్లో నూతనోత్సాహం పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం. పిల్లల్లో పోటీతత్వాన్ని పెంపొందించడంతో పాటు ఇతర పాఠశాలల విద్యార్థులను కలుసుకోవడం, వారితో అభిప్రాయాలను పంచుకోవడం మంచి శుభపరిమాణం. 'సాక్షి' మీడియాకు కృతజ్ఞతలు.

– ప్రణీత్, పేరెంట్, మదీనాగూడ..

పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది



ముందుగా 'సాక్షి' యాజమాన్యానికి మా శిఖర పాఠశాల నుంచి ప్రత్యేక కృతజ్ఞతలు. స్పెల్ బీ, మ్యాథ్స్ బీలను నిర్వహించడం ద్వారా పిల్లల్లో ఆత్మ స్థైర్యం పెరుగుతుంది. ఇంగ్లిష్‌లో మంచి పట్టు సాధిస్తారు. లెర్నింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్ పెరుగుతాయి. విద్యార్థులను ప్రోత్సహిస్తున్న వారి తల్లితండ్రులకు కూడా అభినందనలు. – శ్రేయ, శిఖర స్కూల్ ప్రతినిధి


సీఎం రేవంత్‌రెడ్డిని ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు - కడ్తాల్

ఇరుకున పెడుతున్న ఇరుకు రోడ్డు

ఇరుకు దారి వాహనదారులను భయాందోళనకు గురిచేస్తోంది. నిత్యం రద్దీగా ఉండి, ప్రమాదాలకు నిలయంగా మారిన ఎర్రకుంట ప్రధాన రోడ్డులో ఎప్పుడు ఏం జరుగుతుందోనని వాహన చోదకులతో పాటు పాదచారులు కలవర పడుతున్నారు. గతంలో జరిగిన ప్రమాదాలను తలచుకుంటూ ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
- విస్తరణకు నోచుకోని ఎర్రకుంట ప్రధాన రహదారి
- పట్టించుకోని అధికార యంత్రాంగం


ఎర్రకుంట రహదారిలో ఏర్పడిన గుంతలు

పహాడీషరీఫ్: ఎర్రకుంట రోడ్డు శ్రీశైలం పుణ్య క్షేత్రానికి వెళ్లే ప్రధాన మార్గం. సహజంగానే వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. రద్దీ దృష్ట్యా కొంత కాలం క్రితం ఈ రోడ్డు విస్తరణకు శ్రీకారం చుట్టారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఎర్రకుంట మర్రి చెట్టు నుంచి బార్కాస్ ఫీలి దర్గా వరకు ఉన్న కిలోమీటర్ దూరం విస్తరణకు నోచుకోలేదు. ఫలితంగా ఇక్కడ తరచూ ట్రాఫిక్ జాం కావడంతో పాటు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ఎర్రకుంట చౌరస్తా నుంచి పెట్రోల్ బంక్ సమీపంలోని మర్రి చెట్టు వరకు రోడ్డు మలుపులుగా ఉండడంతో ప్రమాదాల సంఖ్య ఎక్కువగా నమోదవుతోంది. ఇదే విషయమై సంబంధిత అధికారులకు విన్నవించినా.. పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కిలో మీటర్ మేర రోడ్డు విస్తరణ చేపట్టకపోవటానికి అసలు కారణం దర్గా నుంచి ఎర్రకుంట వైపు వెళ్లే మార్గాన 'శ్మశాన వాటిక' ఉండటమే అని పలువురి అభిప్రాయం.

జన సంచారంతో మరింత ఇరుకు

విస్తరణకు నోచుకోని ఎర్రకుంట ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా దుకాణ సముదాయాలు, పాఠశాలలతో పాటు కూరగాయల సంత ఉంది. పెట్రోల్ బంకులు ఉన్నాయి. దీంతో ఇక్కడ నిత్యం జనసంచారంతో పాటు, వాహనాల రాకపోకలు అధికంగానే ఉంటాయి. ఈ సమయంలో ఇక్కడ రోడ్డు దాటే క్రమంలో బాటసారులు ప్రమాదాల బారిన పడుతున్నట్లు తెలుస్తోంది.

ప్రమాదాలకు నిలయం..

ఇరుకైన ఎర్రకుంట మార్గంలోని ఎస్‌జీఏ గార్డెన్ వద్ద 2013 మార్చి 3న ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో సైకిల్‌పై వెళ్తున్న అబూబకర్ బిన్ అబ్దుల్లా వహ్లాస్ (15) మృత్యువాత పడ్డాడు. దీంతో ఆగ్రహించిన స్థానికులు ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సును ధ్వంసం చేయడమే కాకుండా.. ఆందోళన చేశారు. 2015 ఏప్రిల్ 5న ఎర్రకుంట లిమ్రా హోటల్ ఎదుట ఎదురెదురుగా వచ్చిన రెండు బైకులు ఢీకొన్న ఘటనలో తలాబ్‌కట్టా ఈదిబజార్‌కు చెందిన మహ్మద్ మక్సూద్(18) మృతి చెందాడు. 2022 సెప్టెంబర్ 14న ఎర్రకుంట కన్నల్ స్కూల్ వద్ద లారీ ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనదారుడు అద్నాన్ అల్ అన్సార్ అనే డిగ్రీ విద్యార్థి మృత్యువాత పడ్డాడు. ఎర్రకుంట కూడలి రహదారిపై ఏర్పడిన గోతిలో 2024 జనవరి 4న బైక్ కిడ్ అయి, జారిపడిన గులాబ్ శంషుద్దీన్(45) అనే వ్యక్తిపై నుంచి లారీ వెళ్లడంతో అతను దుర్మరణం పాలయ్యాడు.

రోడ్డును విస్తరించాలి



ఎర్రకుంట శ్మశాన వాటిక నుంచి మర్రి చెట్టు వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి. వాహనాల రాకపోకలతో పాటు జనసంచారం పెరిగింది. అందుకు అనుగుణంగా రహదారి లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అసలే ఇరుకైన దారి, దానికి ఇరువైపులా దుకాణదారుల సామగ్రి ఉండటంతో మరింత ప్రమాదకరంగా మారింది. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలి.

– ఖాజా ఖాన్, వాహనదారుడు

మరమ్మతులు శూన్యం



మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎర్రకుంట చౌరస్తాలో రహదారిపై మురుగునీరు పారుతోంది. తద్వారా రోడ్డుపై గోతులు ఏర్పడ్డాయి. కనీస మరమ్మతులు కూడా చేపట్టడం లేదు. గోతుల కారణంగా నాలుగు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ నిండు ప్రాణం బలైంది. తొలుత వ్యర్థ జలాల పారుదలను సరిచేసి, రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకోవాలి.

– మహ్మద్ ఇస్మాయిల్, తూర్‌కాలని

ఆ మలుపులు.. ప్రమాదాలకు పిలుపు


అజీజ్‌నగర్ సోలార్ సమీప రోడ్డుకు ఇరువైపులా ముళ్ల పొదలు


ఎన్కేపల్లి సమీపంలో సూచికబోర్డు లేని మూలమలుపు

- రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు
- సూచిక బోర్డులు లేక ప్రమాదాల బారిన వాహనదారులు
- భయాందోళన వ్యక్తంచేస్తున్న బాటసారులు

మొయినాబాద్ రూరల్: పల్లెలు దేశానికి పట్టుగొమ్మలు. అవి బాగుంటేనే దేశం అభివృద్ధి చెందుతుందనేది జగమెరిగిన సత్యం. కానీ ఇక్కడ అభివృద్ధి సంగతి ఎలా ఉన్నా.. కనీస రోడ్డు సౌకర్యం సరిగా లేక గ్రామీణ ప్రాంత ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇందుకు నిదర్శనం.. మండల పరిధి రహదారుల దుస్థితే.. పల్లెలకు వెళ్లే రహదారులకు పొడవునా ఉన్న మూలమలుపులు ప్రమాదఘంటికలు మోగిస్తున్నాయి. అందుకు కారణం స్థానిక పాలకులు, అధికారులే అని వాహనదారులు బాహటంగానే విమర్శిస్తున్నారు. మండల పరిధి ఎన్కేపల్లి, బాకారం తోలుకట్ట నుంచి ఎత్‌బార్‌పల్లి, అమ్డాపూర్ నుంచి కాశింబౌళి, అజీజ్‌నగర్ నుంచి నాగిరెడ్డిగూడ, బాకారం, హిమాయత్‌నగర్ నుంచి చిల్కూర్, పెద్దమంగళారం నుంచి ఎల్కాగూడకు వెళ్లే రోడ్లలో సుమారు 15 మలుపులు ఉన్నాయి. అవి కనిపించకుండా రోడ్డు మీదకు ముళ్లపొదలు వచ్చాయి. వాటిని సూచించాల్సిన సూచిక బోర్డులు కూడా పాలక వర్గం ఏర్పాటు చేయించకపోవటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని బాధిత గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఉదయం వేళలో ప్రయాణం ఎలా ఉన్నా.. రాత్రి పూట భయాందోళనకు గురిచేస్తుందంటున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



గ్రామాలకు వెళ్లే రహదారుల్లో అధికంగా మూల మలుపులు ఉన్నాయి. దీనికి తోడు రోడ్డుకు ఇరువైపులా ముళ్ల పొదలు ఏపుగా పెరిగాయి. రోడ్ల పైకి వచ్చాయి. దీంతో ఎక్కడ ఏముందో తెలియక వాహనాదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి ముళ్ల పొదలను తొలిగించి, సూచిక బోర్డులు ఏర్పాటు చేయించాలి.

– కొత్తపల్లి తిరుపతి రెడ్డి, బాకారం

ప్రమాదాలను నివారించాలి



గ్రామాలకు వెళ్లేందుకు రోడ్లు ఉన్నప్పటికీ.. చాలా చోట్ల గుంతలు, మూల మలుపులు ఉన్నాయి. రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగాయి. సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి. – మహేందర్ ముదిరాజ్, బాకారం

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి

ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేస్తానని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. ఆదివారం మీర్‌పేట జిల్లెలగూడ స్వాగత్ గ్రాండ్‌లో బాలాపూర్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నార్ల శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని చెప్పారు. ఆర్యవైశ్యుల కోరిక మేరకు నియోజకవర్గంలో ఇప్పటికే వాసవీమాత దేవాలయ నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించానని, అదే విధంగా బడంగ్‌పేట ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయిస్తానని హామీ ఇచ్చారు. మహేశ్వరం నుంచి మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన సందర్భంగా సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. నాయకులు తెరేటిపల్లి శ్రీనివాస్‌గుప్తా, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, కార్యదర్శి అర్థం లక్ష్మయ్యగుప్తా, జిల్లా అధ్యక్షుడు వెంకటేశంగుప్తా, వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాస్‌గుప్తా, బాలాపూర్ మండల ప్రధాన కార్యదర్శి మురళీధర్, కోశాధికారి మంచెన ప్రేమ్‌కుమార్‌గుప్తా, మీర్‌పేట మేయర్ దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రం రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

సామాజిక సేవకులకు అవార్డులు

రాజేంద్రనగర్: నేషనల్ ఉమెన్స్ రైట్స్ సోషల్ జస్టిస్ కమిషన్ తెలంగాణ రాష్ట్ర భారతీయ రత్న అవార్డు–2024 ఆదివారం అందజేశారు. రాజేంద్రనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును బిట్కూరి మహేశ్ బాబు, గాలి విజయలక్ష్మికి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి సంస్థ జాతీయ అధ్యక్షుడు సర్వేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సామాజిక సేవ కార్యక్రమంలో ప్రతిభ చూపుతున్న వారిని గుర్తించి ఈ అవార్డులను అందిస్తున్నామన్నారు. తమ సంస్థ అన్ని రంగాల్లో ప్రతిభ చూపుతున్న వారిని ప్రోత్సహించేందుకు ఈ అవార్డులను అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గుంటి రాజ్ కుమార్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.